




www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్

సోమవారం, సెప్టెంబర్14,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:197 | పేజీలు: 8 | వెల: రూ.5/-







## బ్రిక్స్ సదస్సు విజయవంతం

### పశ్చిమాసియాపై కీలక ఉమ్మడి ప్రకటన

- ఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో కీలక ఉమ్మడి ప్రకటన వెల్లడి
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సంయమనం పాటించాలని దేశాలకు పిలుపు
- ప్రధాని మోదీ దౌత్య చొరవతో భిన్నాభిప్రాయాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- బ్రిక్స్ కూటమికి 20 ఏళ్ల భవిష్యత్ విజన్ అవసరమన్న ప్రధాని మోదీ
- సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి సంకేతంగా విశ్లేషించిన యూఎస్ మీడియా

**న్యూఢిల్లీ, సామాన్యుడి అస్త్రం**

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది .సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి. పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు 'జపాన్ టైమ్స్' తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని 'అల్ జజీరా' పేర్కొంది.సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీసుకున్న నిర్ణయాల అమలుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ నివేదించింది. "గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరితోనూ ఘర్షణ ద్వారా కాకుండా, అందరినీ కలుపుకొని అభివృద్ధిని కోరుకుంటున్నాం" అని మోదీ అన్నారు.మరోవైపు, బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ కూడా ఈ సదస్సులో కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతికత, అభివృద్ధి సవాళ్లపై వ్యాపార ప్రముఖులు, మంత్రులు, దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు యురేషియా రివ్యూ నివేదించింది. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రమాణాల సహకారం వంటి అంశాలపై ఈ ఫోరమ్ సిఫార్సులు సదస్సు ప్రకటనలలో ప్రతిబింబిస్తాయి.ప్రముఖ అమెరికన్ వార్తాపత్రికలు సైతం ఈ సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి ఒక సూచికగా అభివర్ణించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లలో ఎవరి గొంతు బలంగా వినిపిస్తుందనేది ఈ సదస్సులో ప్రధానాంశమని 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది.

---

##### ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి

## ప్రభుత్వ సాయం

### మీ సమస్యలను పరిష్కరిస్తాం




- తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్య ముందుచూపే కారణమన్న రేవంత్ రెడ్డి
- రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని వెల్లడి
- తన ఎదుగుదలకు రోశయ్య సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్న సీఎం
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహ ఏర్పాటును సమర్థించిన రేవంత్

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు.ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు.

---

## కాంగ్రెస్‌నే బంద్ చేస్తారు!



- ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు
- రోడ్ల నుంచి ఆసుపత్రుల వరకు అన్నీ అధ్వానమే
- మాజీ మంత్రి హరీశ్‌రావు

---




##### ఘనంగా ఖైరతాబాద్

## గణనాథుడి ఆవిష్కరణ

- ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి
- పంచముఖ సంకటహర రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు
- మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం
- గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ
- ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం

---

##### ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం

## మహిళల కొట్లాట



---

## పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి

### సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఉరుముల శబ్దానికి ఇద్దరు, పిడుగుపాటుకు మరో ఇద్దరు మృతి
- పండుగపూట విషాదం జరగడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన



**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు మరణించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొనడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిని ఆదుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది.

---

## కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

- డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు
- 65 మార్కుల నుంచి 77 మార్కులకు మారిన వైనంపై సందేహాలు
- అర్హత లేని టెట్ పేపర్‌తో ఉద్యోగం ఇచ్చారని విమర్శ
- ఈ స్కాంపై చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు.జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు.



---

##### స్టాఫ్ సెలక్షన్ కమిషన్

## కీలక ప్రకటన

- ఎస్ఎస్‌సీ సీజీఎల్ 2026 పరీక్షల షెడ్యూల్ విడుదల
- సెప్టెంబర్ 30 నుంచి టైర్-1, టైర్-2 పరీక్షలు
- కంప్యూటర్ ఆధారితంగా టైర్-1 పరీక్ష నిర్వహణ
- ప్రతి తప్పు సమాధానానికి 0.50 నెగటివ్ మార్కులు




---

##### రవాణాను వేగవంతం చేయడమే

## భారత రైల్వే లక్ష్యం

- చెన్నై ఐసీఎఫ్ అభివృద్ధి చేసిన ఈ రైలులో అత్యాధునిక వ్యవస్థలు
- ఈ ట్రయల్ రన్ వీడియోను పంచుకున్న ఏపీ బీజేపీ



# బ్రిక్స్ సదస్సు విజయవంతం

మొదటి పేజీ తరువాయి

**బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకత చాలా కీలకం..**

అస్థిరమైన భౌగోళిక రాజకీయ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకతను పెంచడం ఎంత ముఖ్యమో ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అలాగే, ఈ కూటమికి న్యూఢిల్లీ అధ్యక్షత వహించడం స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారంతోపాటు సుస్థిరత అనే నాలుగు స్తంభాలపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ నాలుగు స్తంభాల ఆధారంగా, బ్రిక్స్ ద్వారా భారతదేశం సమ్మిళిత ప్రపంచ వృద్ధిని ప్రోత్స హించాలని కోరుకుంటోందన్నారు. ఎందుకంటే, ఈ కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం దీనికే పరిమితం కాకూడదన్నారు. వాటిని గ్లోబల్ సౌత్ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని, అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని భారత దేశం విశ్వసిస్తోందని తెలిపారు. 'మీ అందరి సహకారం, మద్దతుతో మన ఉమ్మడి దార్శనికతను పరస్పర ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలిగినందుకు నేను సంతోషిస్తున్నా' అని ఆయన అన్నారు. నేడు ప్రపంచంలో సంఘర్షణలు, ఉద్రిక్తతల సంఖ్య నిరంతరం




పెరుగుతోందని, ఇది సామాన్య ప్రజల జీవితాలపై ప్రతికూల, సుదూర ప్రభావాలను చూపుతోందని చెప్పారు. 'మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటివి నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో ఏ సంక్షోభం కూడా ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయి. అందువల్ల, బ్రిక్స్ కూటమిలో భారత్ స్థితిస్థాపకతను బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. సవాళ్ల ను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధంగా ఉండటం, తక్షణచర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం అని మోదీ వాదించారు.

**బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్..**

ఆవిష్కరణల విభాగంలో, బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ మన స్టార్టప్లను, ఇంక్యుబేట ర్లను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తుంది. వినూత్న మైన, విస్తరించదగిన పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను భారత్ ప్రతిపాదించిందన్నారు. డిజిటల్ వ్యవ సాయంపై బ్రిక్స్ నెట్‌వర్క్ రైతులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, ఎందుకంటే ఈ చొరవ ద్వారా ఏఐ, జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్లను రైతుల అవసరాలకు అనుసంధానిస్తారని తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడాన్ని సులభతరం చేయడానికి బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ చెప్పారు. భారత నాగరికతలో ప్రకృతికి తల్లి హోదా ఇవ్వబడిందని ప్రధాని అన్నారు. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం ఒకదానికొకటి ప్రత్యా మ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలని తాము విశ్వసిస్తున్నామని వెల్లడించారు. 'బ్రిక్స్ కూటమిలో కూడా, మానవ అభివృ ద్ధికి, పర్యావరణానికి మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరాన్ని మోదీ స్పష్టం చేశారు. ఇదే సుస్థిరతకు పునాది. ఇది భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యత కూడా అన్నారు.

# ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ సాయం

మొదటి పేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహాత్మా గాంధీ ఆర్యవైశ్య సమాజానికి చెందినవారని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు కూడా ఆర్యవైశ్యుడేనని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఆర్యవైశ్యుల సేవలు చిరస్మరణీయమని అన్నారు.

**రోశయ్య సలహా ఇప్పటికీ గుర్తుంది..**

మాజీ సీఎం కొణిజేటి రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. తాను అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతున్న సమయంలో ఆవేశాన్ని తగ్గించుకోవాలని రోశయ్య సూచించేవారని చెప్పారు. ఆవేశానికి ఆలోచన తోడైతే భవిష్యత్ ఉంటుంది అంటూ రోశయ్య ఇచ్చిన సలహాను సీఎం గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో తాను సుదీర్ఘకాలం రాణిస్తానని రోశయ్య ముందుగానే గుర్తించారని తెలిపారు. రోశయ్య ఎవరినైనా విమర్శించేవారే తప్ప వ్యక్తిగతంగా దూషించేవారు కాదని కొనియాడారు. రాజకీయాల్లో హుందాతనం, సంయమనం, విలువలు ఎలా ఉండాలో ఆయన జీవితం నేర్పుతుందని అన్నారు. హైదరాబాద్‌తో తన అనుబంధం విడదీయరానిదని రోశయ్య చెప్పేవారని గుర్తు చేశారు.

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం..**

రోశయ్య సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. రోశయ్య ప్రజాసేవను భావితరాలు గుర్తుంచుకునేలా ఆయన విగ్రహం నిలిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇది ఆర్యవైశ్యుల సామాజిక,



సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు ప్రధాన వేదికగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధు యాష్కీ, మందమల పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.


# రవాణాను వేగవంతం చేయడమే భారత రైల్వే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

భారతీయ రైల్వే మరో కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి వందే భారత్ గూడ్స్ రైలు (16 కోచ్‌ల ఫ్రైట్ ఈఎంయూ) కీలకమైన అహ్మదాబాద్-ముంబై సెంట్రల్ మార్గంలో తన ట్రయల్ రన్‌ను ప్రారంభించింది. పశ్చిమ మధ్య రైల్వేలో తొలి దశ పరీక్షలు విజయవంతంగా ముగిసిన అనంతరం, ఇప్పుడు పశ్చిమ రైల్వే పరిధిలో ఈ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. దేశంలో సరకు రవాణాను వేగవంతం చేసే దిశగా ఇది ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. ప్రస్తుతం అహ్మదాబాద్-ముంబై సెంట్రల్ మధ్య ఈ గూడ్స్ రైలు ట్రయల్ రన్ కొనసాగుతోందని, వివిధ వేగాల వద్ద రైలు పనితీరు, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరీక్షిస్తున్నామని అహ్మదాబాద్ డివిజన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) అత్యంత ఆధునిక టెక్నాలజీతో ఈ రైలును రూపొందించింది. వందే భారత్ ప్యాసింజర్ రైళ్ల టెక్నాలజీ ఆధారంగా, పార్శిళ్లు, ఇతర సరకులను అత్యంత వేగంగా



గమ్యస్థానాలకు చేర్చేందుకు దీనిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ వందే భారత్ గూడ్స్ రైలులో అత్యాధునిక ప్రొపల్షన్, బ్రేకింగ్ వ్యవస్థలు, పార్శిళ్లను సులువుగా ఎక్కించి, దించేందుకు ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్లు, ప్రత్యేక రోలర్ ఫ్లోర్ సిస్టమ్ వంటివి ఉన్నాయి. పండ్లు, కూరగాయలు వంటివి పాడవకుండా ఉండేందుకు ఉష్ణోగ్రత నియంత్రిత (రీఫర్) కంటైనర్ల సౌకర్యం కూడా కల్పించారు. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, అగ్నిప్రమాద హెచ్చరిక వ్యవస్థలను అమర్చారు. ఇప్పటికే పశ్చిమ మధ్య రైల్వే పరిధిలోని చౌమహ్లా-శ్యామ్‌గఢ్-గుర్లా, నాగ్‌దా-కోటా-సవాయ్ మాధోపూర్ సెక్షన్లలో



నిర్వహించిన పరీక్షల్లో ఈ రైలు సత్తా చాటింది. ఖాళీ బోగీలతో ఉన్నప్పుడు గంటకు 145 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆర్డీఎస్ఓ, ఐసీఎఫ్ బృందాల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ బ్రేకింగ్, రైలు స్థిరత్వం వంటి అంశాలను పరీక్షించారు. ఈ పరిణామం దేశీయ సరుకు రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని నిపుణులు భావిస్తున్నారు. కాగా, ఈ ట్రయల్ రన్‌కు సంబంధించిన వీడియోను ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకుంది.

# పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి





మొదటి పేజీ తరువాయి

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ ప్రకృతి బీభత్సంలో పిడుగులు పడి వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మృతుల వివరాలు..**

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తలపనేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఆ తీవ్రమైన శబ్దానికి భయపడి గుండెపోటుకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా, కాకాని శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా తన ఇంటి వద్ద పిడుగు పడిన భారీ శబ్దానికి గుండె ఆగి మరణించారు.

# ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం మహిళల కొట్లాట..

మొదటి పేజీ తరువాయి

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరిగి నుంచి హైదరాబాద్ వెళుతున్న టీజీఎస్ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొందరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సుల్లో పెరిగిన రద్దీ, తలెత్తుతున్న వివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది. వివరాల్లోకి వెళితే, వికారాబాద్ జిల్లా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో ఈ గొడవ జరిగింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో సీటు విషయంలో నలుగురు మహిళల మధ్య వాగ్వాదం మొదలై, అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారిని విడదీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గొడవతో ఇబ్బందిపడిన కొందరు ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయినట్లు సమాచారం. తెలంగాణలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే.

# కాంగ్రెస్‌నే బంద్ చేస్తారు!

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పథకాలను, అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా బంద్ చేస్తోంద ని మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను బంద్ చేసేందుకు ప్రజలే సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య తేడా ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారసిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం 286 మంది లబ్ధిదారులకు రూ.65.60 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను హరీశ్‌రావు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు గుంతలు లేని రోడ్లతో సిద్దిపేట అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఏ రోడ్డు చూసినా గుంతలే కనిపిస్తున్నాయని విమర్శించారు. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్కసు చూపుతోందని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు కరెంట్ సరఫరాను 6 గంటలకు పరిమితం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తే మందులు అందుబాటులో లేక బయట నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ కిట్ పథకాన్ని కూడా నిలిపివేశారని ఆరోపించారు.

# స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కీలక ప్రకటన




మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కీలక ప్రకటన చేసింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సీజీఎల్) ఎగ్జామినేషన్-2026కు సంబంధించిన పరీక్షా షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేసింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. సీజీఎల్ టైర్-1, టైర్-2 పరీక్షలను ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో (సీబీటీ) జరగనున్నాయి. టైర్-1 పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో కూడి ఉంటుంది. టైర్-1 పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అనే నాలుగు విభాగాలు ఉంటాయి. ప్రతి విభాగానికి 50 మార్కుల చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షా సమయం ఒక గంట కాగా, ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కుల నెగటివ్ మార్కింగ్ ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. ఇంగ్లీష్ విభాగం మినహా మిగిలిన ప్రశ్నపత్రం ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉంటుంది. పరీక్షలు ముగిసిన వెంటనే ప్రాథమిక 'కీ'ని విడుదల చేసేందుకు ఎస్ఎస్‌సీ కసరత్తు చేస్తోంది.

# మెగా డీఎస్సీ: కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

మొదటి పేజీ తరువాయి

జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-×-ాకు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-××-దీలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

# ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి

భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు. ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు. ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి.

# ఒడిశా నుంచి గంజాయి దందా..
# రెండు కేసుల్లో 2.815 కేజీలు పట్టివేత!

- మాదాపూర్ ఎక్సైజ్ పరిధిలో 2.545 కేజీల గంజాయి స్వాధీనం
- కుత్బుల్లాపూర్ డీడీఎఫ్ తనిఖీల్లో మరో 270 గ్రాములు పట్టివేత
- ఇద్దరిని అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించిన అధికారులు



**సామాన్యుడి అస్త్రం / మాదాపూర్ :**

ఒడిశా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలించిన గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 2.545 కేజీల గంజాయి బయటపడింది. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మరోవైపు, కుత్బుల్లాపూర్ డీడీఎఫ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో మరో 270 గ్రాముల గంజాయి పట్టుబడింది. రెండు కేసుల్లో కలిపి మొత్తం 2.815 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ వర్గాల సమాచారం. ఈ కేసులకు సంబంధించి ప్రదీప్ గూగల్, షరీఫుల్ అనే ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తదుపరి విచారణ కోసం కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, నగరంలో ఎవరికి సరఫరా చేయాలని భావించారు, దీని వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. బయటి రాష్ట్రాల నుంచి నగరానికి మాదకద్రవ్యాలు చేరుతున్న నేపథ్యంలో రవాణా మార్గాలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# మట్టి గణపతిని మరిస్తే.. భావితరాలకు ఏం మిగులుస్తాం?



- తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో మట్టి వినాయకుడికి పూజలు
- గంగాజలంలో పర్యావరణహితంగా నిమజ్జనం చేసిన బలరాం యాదవ్
- చిన్నారులకు ఎకో ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాల పంపిణీ

**సామాన్యుడి అస్త్రం / కొండాపూర్:**

వినాయకుడిని పూజించడం ఎంత ముఖ్యమో.. ఆ పూజ కారణంగా ప్రకృతికి హాని కలగకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో ఆయన మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం గంగాజలంలో పర్యావరణహితంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ.. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నిష్ఠగా పూజించిన తర్వాత గంగాజలంలో నిమజ్జనం చేయడం మన సంప్రదాయమని గుర్తుచేశారు. ప్రస్తుతం చాలామంది మట్టి విగ్రహాలకు బదులుగా ఇతర విగ్రహాలవైపు మొగ్గుచూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని మనం కాపాడుకోకపోతే భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించలేమని స్పష్టం చేశారు. "భక్తి పేరుతో ప్రకృతికి హాని కలిగించడం సరికాదు. పండుగలు మన సంప్రదాయాలను నిలబెట్టడంతోపాటు సమాజానికి మంచి సందేశాన్ని అందించాలి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి" అని బలరాం యాదవ్ పిలుపునిచ్చారు. మాటలతోనే కాకుండా తనవంతు బాధ్యతను చాటుతూ 'ఎకో ఫ్రెండ్లీ గణేశ్' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు మట్టి వినాయకుడి విగ్రహాలను అందజేశారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు మరోసారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మందుబాబులపై సైబరాబాద్ పోలీసుల కొరడా..
# ఒక్క వీకెండ్‌లో 292 కేసులు!

- పట్టుబడిన వారిలో 240 మంది ద్విచక్ర వాహనదారులే
- 14 మందికి 301 నుంచి 550 ఎంజీ వరకు నమోదైన బీఏసీ
- ప్రమాదానికి కారణమైతే పదేళ్ల జైలు పడొచ్చని పోలీసుల హెచ్చరిక





**సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్:**

మద్యం మత్తులో రోడ్లపైకి వస్తున్న వాహనదారులపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపించారు. వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి మొత్తం 292 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను సైబరాబాద్ ట్రాఫిక్ అడ్మిన్ అదనపు డీసీపీ జి. నరేందర్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో 240 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు. హెవీ వెహికల్ డ్రైవర్లపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మొత్తం కేసుల్లో ద్విచక్ర వాహనదారులే అత్యధికంగా ఉండటం రోడ్డు భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) ఆధారంగా పరిశీలిస్తే 248 మందికి 36 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ స్థాయి నమోదైంది. మరో 30 మందికి 201 నుంచి 300 ఎంజీ మధ్య ఉండగా, 14 మందికి ఏకంగా 301 నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారందరినీ చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మద్యం తాగి వాహనం నడపడం కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి, ప్రాణనష్టానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత--2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ నేరంలో గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 7 నుంచి 12వ తేదీ వరకు మొత్తం 681 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 18 మందికి జరిమానాతోపాటు జైలు శిక్ష, ఏడుగురికి జరిమానాతోపాటు సామాజిక సేవ విధించగా, మిగిలిన 656 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వీకెండ్ వినోదం పేరుతో మద్యం తాగి స్టీరింగ్ పట్టుకుంటే తమ ప్రాణాలతోపాటు రోడ్డుపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలనూ ప్రమాదంలో పడేసినట్లేనని పోలీసులు గుర్తుచేశారు. మద్యం సేవించిన వారు క్యాబ్, ఆటో లేదా ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించాలని సూచించారు.

# మెట్రో రెండో దశ: అగ్నిపరీక్షకు సిద్ధమైన రేవంత్ సర్కార్!



- 3.25 కి.మీ. మేర అండర్‌గ్రౌండ్, డబుల్ డెక్కర్ నిర్మాణాలు
- వివిధ మార్గాల్లో ఆరు రైల్వే క్రాసింగ్‌లను దాటాల్సిన పరిస్థితి
- పలు కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి
- మొదటి దశను టేకోవర్ చేశాకే రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో మరో కీలక అధ్యాయానికి తెరలేవనుంది. ప్రతిపాదిత మెట్రో రైలు రెండో దశ విస్తరణ, కేవలం కిలోమీటర్ల పరంగానే కాదు, నిర్మాణపరంగానూ ప్రభుత్వానికి పెద్ద సవాలు విసరనుంది. మొదటి దశతో పోలిస్తే ఇది పూర్తి భిన్నం. భూగర్భ మార్గాలు, డబుల్ డెక్కర్ నిర్మాణాలు, కీలకమైన రైల్వే క్రాసింగ్‌లతో కూడిన ఈ ప్రాజెక్టు, ప్రభుత్వ సమన్వయ సామర్థ్యానికి, ప్రణాళికా నైపుణ్యానికి అగ్నిపరీక్షగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రెండో దశ కింద మొత్తం 123 కిలోమీటర్ల మేర 7 మార్గాల్లో 86 స్టేషన్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పూర్తయితే నగరంలో మెట్రో స్టేషన్ల సంఖ్య 143కు చేరనుంది. అయితే, ఈ విస్తరణ మార్గం అనుకున్నంత సులభం కాదు.

**నిర్మాణంలోనే సంక్లిష్టత**

**రెండో దశలో ఎదురయ్యే అతిపెద్ద సవాళ్లలో భూగర్భ, డబుల్ డెక్కర్ నిర్మాణాలు ప్రధానమైనవి.**

భూగర్భ మార్గం: శంషాబాద్ విమానాశ్రయం వద్ద 1.6 కి.మీ., హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద 1.65 కి.మీ. మేర భూగర్భంలో మెట్రో లైన్ నిర్మించాల్సి ఉంటుంది. అత్యంత కీలకమైన ఈ ప్రాంతాల్లో నిర్మాణానికి విమానాశ్రయ, రక్షణ శాఖల నుంచి ప్రత్యేక అనుమతులు సాధించడం అత్యంత కీలకం. డబుల్ డెక్కర్: మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మదీనాగూడ-చందానగర్ మధ్య 1.2 కి.మీ. డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టనున్నారు. కింద ఫ్లైఓవర్, పైన మెట్రో ఉండే ఈ వినూత్న నిర్మాణానికి కేంద్ర రవాణా శాఖ ఆమోదముద్ర తప్పనిసరి.

**రైల్వే లైన్ల రూపంలో మరో గండం**

ప్రాజెక్టుకు మరో పెద్ద అవరోధం రైల్వే లైన్లు. ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్‌తో పాటు జేబీఎస్-మేడ్చల్ మార్గంలో గుండ్ల పోచంపల్లి, సుచిత్ర, అల్వాల్ వద్ద.. ఇలా మొత్తం ఆరు చోట్ల రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంది. దీనికి రైల్వే బోర్డుతో సుదీర్ఘ సంప్రదింపులు, సమన్వయం అవసరం. ఇది ప్రాజెక్టులో జాప్యానికి కారణమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ముందున్న మార్గం కఠినం**

ఇన్ని సవాళ్లను అధిగమించడంతో పాటు, ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ప్రభుత్వానికి మరో పెద్ద టాస్క్. మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి అధికారికంగా స్వాధీనం చేసుకున్న తర్వాతే రెండో దశకు కేంద్రం నుంచి ఆమోదం, నిధుల లభ్యతపై స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మొత్తమ్మీద, మెట్రో రెండో దశ విస్తరణ ప్రభుత్వ పట్టుదల, ప్రణాళికాబద్ధతకు నిజమైన పరీక్షగా నిలవనుంది.

# సైమా అవార్డ్స్ ఫంక్షన్ లో మల్లారెడ్డి కోడలు సందడి మామూలుగా లేదు

- బెంగళూరు సైమా వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రీతి రెడ్డి
- మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలుగా అందరి దృష్టిని ఆకర్షించిన వైనం
- స్టార్ హీరోయిన్లకు దీటుగా డిజైనర్ దుస్తులతో రెడ్ కార్పెట్‌పై హొయలు
- ఆమె గ్లామరస్ లుక్‌పై సోషల్ మీడియాలో విస్తృత చర్చ



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

బెంగళూరులో సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) వేడుకలో ఓ ఊహించని అతిథి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టాలీవుడ్, కోలీవుడ్ తారల తళుకుబెళుకుల మధ్య, రాజకీయ, వ్యాపార ప్రముఖుల హడావుడిలో తెలంగాణ మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా మారారు. సినీ పరిశ్రమతో నేరుగా ఎలాంటి సంబంధం లేకపోయినా, ఆమె ఈవెంట్‌లో అందరి దృష్టినీ తనవైపు తిప్పుకున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని మల్లారెడ్డి విద్యాసంస్థల్లో తరచూ సినిమా ఈవెంట్లు, షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలోనే సైమా నిర్వాహకులు ప్రీతి రెడ్డిని ఈ వేడుకకు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. ఈవెంట్‌కు హాజరైన ప్రీతి రెడ్డి.. ఖరీదైన డిజైనర్ దుస్తుల్లో, స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని గ్లామర్‌తో రెడ్ కార్పెట్‌పై నడిచారు. ఆమె హొయలు, కెమెరాలకు ఇచ్చిన ఫోజులు చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. ఫోటోగ్రాఫర్లు, సోషల్ మీడియా ప్రతినిధులు ఆమెను తమ కెమెరాల్లో బంధించేందుకు పోటీపడ్డారు. ప్రీతి రెడ్డి గ్లామరస్ లుక్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఒక రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మహిళ, ఫ్యాషన్ ప్రపంచంలో ఇంతటి సంచలనం సృష్టించడంపై సినీ వర్గాలు కూడా ఇటువైపు దృష్టి సారించాయి. మొత్తానికి, ప్రీతి రెడ్డి సైమా ఎంట్రీ ఊహించని విధంగా ఓ ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా నిలిచిపోయింది.

# ఆర్థిక క్రమశిక్షణకు ఆర్యవైశ్యులు ప్రతీక

**మీ సమస్యలను పరిష్కరిస్తాం**
**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం**
**సీఎం రేవంత్‌రెడ్డి హామీ**
**ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమి పూజ**



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మా భిమానం కలిగినవారని, పేదరికం ఎదురైనా తమ కష్టాలను బయటకు చెప్పుకోకుండా కడుపులో దాచుకునే మనస్తత్వం వారిదని సీఎం రేవంత్‌రెడ్డి
అన్నారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే మరింత బలం చేకూరుతుందని సూచించారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఆదివారం సీఎం భూమిపూజ చేశారుఅనం తరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరని కొనియాడారు. కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారాన్ని ఆర్యవైశ్యులకే అప్పగించామని గుర్తుచేశారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సలహాలు కావాలంటే ఆర్యవైశ్యులనే సంప్రదిస్తారని అన్నారు. ముఖ్య మంత్రులు ఎంతమంది మారినా ఆర్థిక మంత్రిగా కొణిజేటి రోశయ్య కొనసాగారని, ఆయన ఆర్థిక నిర్వహణలో చూపిన దూరదృష్టి, సమర్థత ప్రత్యేకమైనవని ప్రశంసించారు.

**ఆకలి తీర్చే ధాతృత్వం..**

ఆర్యవైశ్యులు వ్యాపారంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని సీఎం అన్నారు. ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చే ధాతృత్వం వారిలో ఉందని ప్రశంసించారు. పేదలకు అవసరమైనప్పుడు ఉదారంగా అప్పులు ఇచ్చి ఆదు కుంటారని చెప్పారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య సమాజం దేశానికి అందించిన సేవలను సీఎం ప్రస్తావించారు.ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహాత్మా గాంధీ ఆర్యవైశ్య సమాజానికి చెందినవారని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు కూడా ఆర్యవైశ్యుడేనని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఆర్యవైశ్యుల సేవలు చిరస్మరణీయమని అన్నారు.

**రోశయ్య సలహా ఇప్పటికీ గుర్తుంది..**

మాజీ సీఎం కొణిజేటి రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. తాను అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతున్న సమయంలో ఆవేశాన్ని తగ్గించుకోవాలని రోశయ్య సూచించేవారని చెప్పారు. ఆవేశానికి ఆలోచన తోడైతే భవిష్యత్ ఉంటుంది అంటూ రోశయ్య ఇచ్చిన సలహాను సీఎం గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో తాను సుదీర్ఘకాలం రాణిస్తానని రోశయ్య ముందుగానే గుర్తించారని తెలిపారు. రోశయ్య ఎవరినైనా విమర్శించేవారే తప్పా వ్యక్తిగతంగా దూషించేవారు కాదని కొనియాడారు. రాజకీయాల్లో హుందాతనం, సంయమనం, విలువలు ఎలా ఉండాలో ఆయన జీవితం నేర్పుతుందని అన్నారు. హైదరాబాద్‌తో తన అనుబంధం విడదీయరానిదని రోశయ్య చెప్పేవారని గుర్తు చేశారు.

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం..**

రోశయ్య సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. రోశయ్య ప్రజాసేవను భావితరాలు గుర్తుంచుకునేలా ఆయన విగ్రహం నిలిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇది ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు ప్రధాన వేదికగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధు యాష్కీ, మందమల పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల వాడకంలో తెలంగాణ వెనుకడుగు

**ఏటా తగ్గుతున్న వినియోగం**
**2025 25.77 శాతానికే పరిమితం**
**ఏపీ వినియోగించింది 74.27%**
**12 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా పడిపోయిన తెలంగాణ వాడకం**
**34% తాత్కాలిక వాటా ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి**
**మొత్తం వినియోగం పెరుగుతున్నా తగ్గుతున్న రాష్ట్ర వాటా**

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**



కృష్ణా నదీజలాల వినియో గంలో తెలంగాణ () వాటా క్రమంగా తగ్గిపోతున్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 34 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం తాత్కాలిక నిష్పత్తి ప్రాతిపదికగా ఉన్నప్పటికీ.. వాస్తవ వినియోగంలో తెలంగాణ ఆ స్థాయిని కూడా అందుకోలేకపోతోంది. ముఖ్యంగా 2024 2025 సంవత్సరాల్లో కృష్ణా జలాల్లో తెలంగాణ వినియోగ వాటా వరుసగా 28.49 శాతం,25.77 శాతానికి పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఏపీ వాటా 71.51 శాతం నుంచి ఏకంగా 74.27 శాతానికి పెరిగింది. గణాంకాల ప్రకారం 2025 రెండు రాష్ట్రాలు కలిపి 1,038.98 టీఎంసీల నీటిని వినియోగించాయి. ఇందులో తెలంగాణ వాటా 267.73 టీఎంసీలు కాగా.. ఏపీ 771.25 టీఎంసీలు వినియోగించింది. అంటే మొత్తం వినియోగంలో తెలంగాణకు నాలుగో వంతుకు కొద్దిగా ఎక్కువ వాటా దక్కగా.. ఏపీ దాదాపు మూడొంతుల కంటే ఎక్కువ నీటిని వినియో గించిన పరిస్థితి కనిపిస్తోంది.కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 34 శాతం తాత్కాలిక వాటా ప్రాతిపదికగా ఉంటే.. 2025 వాస్తవ వినియో గం మాత్రం 25.77 శాతానికే పరిమితమైంది. 34 శాతం వాటా స్థాయితో పోలి స్తే ఇది 8.23 శాతం తక్కువ కావడం గమనార్హం. 2025 మొత్తం 1,038.98 టీఎంసీలలో 34 శాతం లెక్కన తెలంగాణ వాటా సుమారు 353 టీఎంసీలకు పైగా ఉండాల్సి వస్తుంది. కానీ వాస్తవ వినియో గం 267.73 టీఎంసీల వద్దే నిలిచింది.అంటే 34 శాతం స్థాయితో పోల్చితే సుమారు 85 టీఎంసీల మేర తక్కువ వినియోగం నమోదైనట్లు గణాంకాల ఆధారంగా లెక్క తేలుతోంది. ఇదే సమయంలో ఏపీ 771.25 టీఎంసీలను వినియోగించింది. ఫలితంగా రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగంలో వ్యత్యాసం మరింత పెరిగింది.

**2024 ఇదే పరిస్థితి..**

2024 గణాంకాలను పరిశీలించినా పరిస్థితిలో పెద్ద మార్పు కనిపించలేదు. ఆ ఏడాది మొత్తం 1,004 టీఎంసీల కృష్ణా జలాలు వినియోగించగా.. తెలంగాణ 286 టీఎంసీలు మాత్రమే వినియోగించింది. ఇది మొత్తం వినియోగంలో 28.49 శాతంగా ఉంది. అదే ఏడాది ఏపీ 718 టీఎంసీలు వినియోగించి 71.51 శాతం వాటాను పొందింది. అంటే 2024 తెలంగాణ 30 శాతం కంటే దిగువకు పడిపోయింది. మరుసటి ఏడాది పరిస్థితి మరింత దిగజారి 25.77 శాతానికి చేరిందిరెండేళ్లలో ఏపీ వినియోగం పెరిగగా.. తెలంగాణ వాటా మాత్రం తగ్గింది. 2019- నుంచి 2022 వరకు తెలంగాణ కృష్ణా జలాల వినియోగ వాటా దాదాపు 29-30 శాతం మధ్య కొనసాగింది. 2019- 29.88 శాతం, 2020 29.04 శాతం, 2021- 29.89 శాతం, 2022 30 శాతంగా నమోదైంది. కానీ 2024 28.49 శాతానికి, 2025 ఏకంగా 25.77 శాతానికి పడిపోయింది. అంటే 2022 పోలిస్తే కేవలం రెండేళ్లలోనే తెలంగాణ వాటా 4.23 శాతం వినియోగం తగ్గింది.ఇదిలా ఉండగా 2025 తెలంగాణ వినియోగించిన 267.73 టీఎంసీలు గత 12 ఏళ్లలో అతి తక్కువ పరిమాణం కాదు. 2015 కేవలం 69.688 టీఎంసీలు, 2016 152.386 టీఎంసీలు, 2023- 120 టీఎంసీల వినియోగం నమోదైంది. కాబట్టి ప్రస్తుత గణాంకాల్లో ప్రధానంగా కనిపిస్తున్న సమస్య నీటి పరిమాణం మాత్రమే కాదు.. రెండు రాష్ట్రాల మొత్తం వినియోగంలో తెలంగాణ వాటా తగ్గిపోయింది.

వినియోగంలో విఫలమెందుకు?

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వాటాను ఎందుకు వినియోగించుకో లేకపోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవైపు రాష్ట్రానికి న్యాయమైన వాటా కావాలని డిమాండ్ చేస్తూ.. మరోవైపు అందుబాటులోకి వచ్చే నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతే భవిష్యత్‌లో నీటి లెక్కల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. నీటి వినియోగం కేవలం నది నుంచి నీరు రావడంపైనే ఆధారపడదు.ప్రాజెక్టుల సామర్థ్యం, రిజర్వాయర్ల నిర్వహణ, కాలువల నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలు, విద్యుత్ లభ్యత, పంపింగ్ సామర్థ్యం, నీటిని సకాలంలో విడుదల చేయించుకోవడం వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. అందువల్ల తెలంగాణకు ఎంత నీరు దక్కాలి? అనే ప్రశ్నతో పాటు.. దక్కాల్సిన నీటిని ఎంత మేర వినియోగించుకోగలుగుతున్నాం? అనే ప్రశ్న కూడా అంతే కీలకంగా మారింది. 2025 ఏపీ వాటా 74.27 శాతంగా నమోదైంది.2024 ఇది 71.51 శాతం కాగా... ఒక్క ఏడాదిలోనే ఏపీ వాటా 2.76 శాతం పెరిగింది. మరోవైపు తెలంగాణ వాటా 28.49 శాతం నుంచి 25.77 శాతానికి తగ్గింది. ఈ రెండు ధోరణులను కలిపి చూస్తే కృష్ణా జలాల వాస్తవ వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య అంతరం మరింత విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది.2025- ఏపీ వినియోగం తెలంగాణ కంటే 503.52 టీఎంసీలు ఎక్కువ. అంటే తెలంగాణ వినియోగించిన 267.73 టీఎంసీలతో పోలిస్తే ఏపీ వినియోగం దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంది. గత రెండేళ్లలో మొత్తం కృష్ణా జలాల వినియోగం 34.98 టీఎంసీలు పెరిగినప్పటికీ, ఆ పెరుగుదల తెలంగాణకు దక్కలేదు. తెలంగాణ వినియోగం 18.27 టీఎంసీలు తగ్గగా.. ఏపీ వినియోగం 53.25 టీఎంసీలు పెరిగింది.

**అప్రమత్తం కావాల్సిందే..**

కృష్ణా జలాల తుది వాటా విషయంలో ఇప్పటికే రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ గణాంకాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. భవిష్యత్ నీటి పంపిణీ, ప్రాజెక్టుల అవసరాలు, సాగు విస్తీర్ణం, తాగునీటి అవసరాలు, నదీ పరీవాహక ప్రాంతం వంటి అంశాలతో పాటు గత వినియోగ గణాంకాలు కూడా చర్చలోకి వచ్చే అవకాశం ఉంది. అందువల్ల తెలంగాణకు ఇప్పుడు రెండు వైపులా సవాలు ఉంది.ఒకవైపు కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం బలమైన వాదనను వినిపించాలి. మరోవైపు రాష్ట్రానికి లభించే నీటిని సకాలంలో, పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచాలి. నీటిని వినియోగించుకోలేకపోవడం వల్ల భవిష్యత్‌లో సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌పై ఆధారపడే దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఈ అంశం అత్యంత కీలకంగా మారుతుంది.ఈ నేపథ్యంలో 2025 గణాంకాలు తెలంగాణకు ఒక ముఖ్యమైన హెచ్చరికగా కనిపిస్తున్నాయి. మొత్తం కృష్ణా జలాల వినియోగం 1,038.98 టీఎంసీలకు పెరిగిన సమయంలో.. తెలంగాణ వినియోగం 267.73 టీఎంసీలకే పరిమితమైంది. ఫలితంగా రాష్ట్ర వాటా 25.77 శాతానికి పడిపోయింది. గతంలో 29-30 శాతం చుట్టూ ఉన్న తెలంగాణ వాటా ఇప్పుడు 26 శాతానికి దిగువకు రావడం సాధారణ పరిణామంగా తీసుకోవాల్సిన అంశం కాదు.రాష్ట్ర భవిష్యత్ సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల లక్ష్యాలు, కృష్ణా జలాలపై హక్కుల నేపథ్యంలో ఇది వ్యూహాత్మకంగా పరిశీలించాల్సిన అంశంగా మారింది. కృష్ణా జలాలపై హక్కు కోసం పోరాటం ఒక వైపు.. దక్కే ప్రతి టీఎంసీని ఒడిసిపట్టుకోవడం మరో వైపు.. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటేనే తెలంగాణ తన నీటి హక్కులను బలోపేతం చేసుకోగలదు.

# టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభం..



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (౧×మీం)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇవాళ (ఆదివారం) ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు.వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం: కొండా మురళి



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడంపై కొండా మురళీ స్పందించారు. తమ కుమార్తె వ్యాఖ్యలకు, తమకు సంబంధం లేదన్న మురళి.. కాంగ్రెస్ పార్టీని వీడేదిలేదని తేల్చి చెప్పారు. వరంగల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారుకొండా మురళి మాట్లాడుతూ.. 'కొండా సురేఖది, నాదీ ఒకే మాట.. మా కూతురిది వేరు మాట. మా కూతురు ప్లాన్ బీ ఏంటో నాకు తెలీదు. మా బిడ్డ వ్యాఖ్యలకు, మాకు సంబంధం లేదు. మా గెలుపు కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారు. అలాంటప్పుడు మేము పార్టీని ఎలా వీడతాం. కృతజ్ఞత అనేది మా రక్తంలో ఉంది. రాహుల్ గాంధీని ప్రధాని చేసేవరకూ పోరాడతాం'.. అని అన్నారు.కొండా సుస్మిత వ్యవహారంపై సురేఖ ఎందుకు స్పందించలేదనే ప్రశ్నకు మురళీ సమాధానమిచ్చారు. 'మా కూతురు మాట్లాడిన మాటలు వ్యక్తిగతం అయినప్పటికీ.. పార్టీకి క్షమాపణలు చెప్పాలని సురేఖకు చెప్పాను. లేదంటే పేపర్ మీద రాసి ఇవ్వాలని బతిమాలాను. కానీ, సురేఖ ఒప్పుకోలేదు'.. అని అన్నారు. 'ఎన్నిరోజులు బ్రతికామనేది కాదు.. ఎలా బ్రతికామనేదే ముఖ్యం. మాట మీద నిలబడి ఉంటాం. పదవులు వస్తాయి, పోతాయి. వ్యక్తిత్వమే మనల్ని కాపాడుతుంది'.. అని కొండా మురళి పేర్కొన్నారు.తాము పదవులను ఆశించి పనిచేసేవాళ్లం కాదని కొండా మురళి అన్నారు. పార్టీలు మారతామన్న వార్తల్లో నిజం లేదని, కాంగ్రెస్‌లో ఉండి ప్రజాసేవ చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. 'వైఎస్ చనిపోయాక ఆయనిచ్చిన మంత్రి పదవి వద్దని పావురాల గుట్టలో రాజీనామా పత్రం పడేసి వచ్చాం.. కానీ పదవి కోసం పాకులాడలేదు. నమ్మితే నమ్మకంగా ఉంటాం.. లేదంటే లేదు. కార్యకర్తలే నాబలం, బలహీనత.. ఎక్కడైనా భూకబ్జాకు పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా'.. అని కొండా మురళి సవాల్ చేశారు.

# ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం:**

రాష్ట్రంలోని ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగి.. ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు చెప్పారు. వాడవాడలా గణేష్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. గణేష్ నవరాత్రుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ సందర్భంగా నగర పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.భక్తుల రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్లు: ఈ వారంలోనే లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలు




**ఇప్పటికే 5,521 మందిని అర్హులుగా గుర్తించిన హౌసింగ్ బోర్డు**
**మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇవ్వొద్దని లబ్ధిదారులకు గట్టి హెచ్చరిక**
**కేటాయింపు పత్రంతో పాటే చెల్లింపుల వివరాలు, బ్యాంకు ఖాతా అందజేత**
**ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ**
**విడతల వారీగా లబ్ధిదారుడు చెల్లించాల్సింది రూ.6 లక్షలు**

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్‌లోని ఇందిరమ్మ టవర్స్ పథకం కింద ఎంపికైన ఎల్ఐజీ (తక్కువ ఆదాయ వర్గం) లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ వారంలోనే వారికి ఫ్లాట్ల కేటాయింపు పత్రాలను అందజేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వి.పి. గౌతమ్ ఆదివారం ప్రకటించారు. అర్హత పొందిన లబ్ధిదారులకు అధికారిక కేటాయింపు పత్రంతో పాటు, మొదటి విడత చెల్లించాల్సిన మొత్తం, గడువు, అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు అందిస్తామని తెలిపారు.లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మొత్తం 7,340 మందిలో ఇప్పటివరకు సుమారు 6,660 మందికి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని గౌతమ్ వివరించారు. వీరిలో 5,521 మందిని అర్హులుగా నిర్ధారించామని, మిగిలిన వారి పరిశీలన కూడా ఈ వారంలోనే ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులందరికీ పత్రాలు జారీ చేస్తారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన కీలక సూచనలు చేశారు. చెల్లింపులు కేవలం ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక ఖాతాలో మాత్రమే చేయాలని, మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి వారికి నగదు లేదా కమీషన్ రూపంలో డబ్బులు ఇవ్వొద్దని హెచ్చరించారు. ఎంపిక కాని వారికి రూ.10,000 ఈఎండీ రీఫండ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని గుర్తుచేశారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల 'క్యూర్' పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఈ ఇళ్లను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లాట్‌పై ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందిస్తుండగా, లబ్ధిదారులు రూ. 6 లక్షలు విడతలవారీగా చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని లేదా 040-24603572 నంబరును సంప్రదించాలని అధికారులు సూచించారు.

# నకిలీ మెడికల్ క్లెయిమ్‌లతో అమెరికాలో మోసం.. హైదరాబాద్‌లో నిందితుడు!



**అమెరికాలో రూ. 620 కోట్ల భారీ మెడికేర్ స్కామ్‌కు పాల్పడిన నిందితుడు**
**మహమ్మద్ ఖదీర్ ఖాన్ హైదరాబాద్‌లో ఉన్నట్లు అనుమానం**
**నకిలీ సంతకాలతో భారీగా నిధులు స్వాహా**
**అమెరికా అధికారుల సమాచారంతో రంగంలోకి హైదరాబాద్ పోలీసులు**

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

అమెరికాలో సుమారు రూ. 620 కోట్ల విలువైన భారీ మెడికేర్ కుంభకోణానికి పాల్పడి, మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఓ భారతీయ వ్యక్తి ప్రస్తుతం హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు తెలిసింది. మహమ్మద్ ఖదీర్ ఖాన్ అనే ఈ నిందితుడు నగరంలోనే ఉన్నాడని అమెరికా పోలీసులు హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన స్థానిక అధికారులు అతడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.టెక్సాస్‌లోని రిచర్డ్‌సన్‌లో ఖదీర్ ఖాన్ 'అమెరికన్ ప్రీమియర్ ల్యాబ్స్' పేరుతో ఒక జెనెటిక్ టెస్టింగ్ ల్యాబొరేటరీని నిర్వహించేవాడు. 2023 ఆగస్టు నుంచి 2024 అక్టోబర్ మధ్య కాలంలో, అమెరికా ప్రభుత్వ మెడికేర్ పథకం కింద సుమారు 93 మిలియన్ డాలర్ల విలువైన నకిలీ క్లెయిమ్‌లను అతడు సృష్టించాడు. వీటి ద్వారా ప్రభుత్వం నుంచి 65 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 620 కోట్లు) అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో తేలింది. వైద్యుల వివరాలు, సంతకాలను ఫోర్జరీ చేసి ఈ భారీ మోసానికి పాల్పడినట్లు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, ఎఫ్‌బీఐ, ఆరోగ్య శాఖల సంయుక్త విచారణలో వెల్లడైంది.ఈ కుంభకోణం బయటపడటంతో అధికారులు ఖాన్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి, అతడిని 'మోస్ట్ వాంటెడ్ ఫ్యుజిటివ్'గా ప్రకటించారు. అయితే, అప్పటికే అతను అమెరికా నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం ఖాన్ హైదరాబాద్‌లోనే ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో, శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుల జాబితాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరవ్యాప్తంగా గాలిస్తున్నారు.

# తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్..

**తెలంగాణలో మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం**
**మొత్తం 1.51 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పరిష్కారం**
**3,896 సైబర్ ఫ్రాడ్ కేసుల సెటిల్‌మెంట్.. బాధితులకు రూ.42.29 కోట్ల వాపసు**
**కేసుల పరిష్కారంలో హైదరాబాద్, ఖమ్మం, గద్వాల యూనిట్లు టాప్**
**న్యాయవ్యవస్థ, పోలీసుల సమన్వయంతో కేసుల భారం తగ్గింపు**



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (౧+ూూూ), జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు (ఞూూూ), పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ.. నేడే తొలి పూజ



ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి పంచముఖ సంకటహర రూపంలో

**దర్శనమిస్తున్న గణనాథుడు**
**మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం**
**సోమవారం గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ**
**ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం**

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు.ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు.ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి.వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

# అల్వాల్‌లో దారుణం: ఇంటర్ విద్యార్థినిపై 8 మంది అత్యాచారం!

**నెలల తరబడి బాలికపై నిందితుల పైశాచికం**
**మత్తుమందు, గంజాయికి బానిస చేసి ఘోరానికి పాల్పడిన నిందితులు**
**బాధితురాలు తప్పించుకుని ఇంటికి చేరడంతో వెలుగులోకి దారుణం**
**నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు**



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్ అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బాలికపై నెలల తరబడి 8 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఈ ఘోరం బయటపడగా, పోలీసులు 8 మంది నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. పదో తరగతిలో ఉన్నప్పుడు జెర్రీ వరుణ్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం, ఆ యువకుడు చాక్లెట్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి, తన కారులోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో మొదలైన నరకం నెలలపాటు కొనసాగింది.ఆ తర్వాత జెర్రీ వరుణ్ ద్వారా రొమాల వరుణ్ అనే మరో యువకుడు పరిచయమయ్యాడు. అతడు బాలికకు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అలవాటు చేసి, కొంపల్లిలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. వీరే కాకుండా, డేవిడ్ వరుణ్ అనే ఇంకో వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, మద్యం తాగించి అసభ్యంగా ప్రవర్తించాడు.కుమార్తె ప్రవర్తనలో మార్పు గమనించిన తండ్రి ఈ నెల 9న ఆమెను మందలించడంతో, బాలిక ఇల్లు వదిలి బొల్లారం రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ పరిచయమైన నీరజ్ అనే వ్యక్తి, తన స్నేహితుడు విక్కీని పిలిపించాడు. ఇద్దరూ కలిసి బాలికకు మత్తుమందు ఇచ్చి, వేర్వేరుగా అత్యాచారం చేశారు. అక్కడితో ఆగకుండా, విక్కీ తన మరో స్నేహితుడు నిఖిల్‌తో కలిసి బాలికను దూలపల్లిలోని ఓయో గదికి తీసుకెళ్లాడు. అక్కడ నిఖిల్, అతడి ఇద్దరు స్నేహితులతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.ఆ రాత్రి బాధితురాలిని విక్కీ తన ఇంట్లో బంధించాడు. 10వ తేదీన అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక మళ్లీ బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకోగా.. విక్కీ, అతడి స్నేహితుడు గణేశ్ కలిసి అడ్డుకున్నారు. వారు బాలికను బలవంతంగా మత్తులోకి దించి మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ రైలులో మరోసారి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం మల్కాజిగిరికి చేరుకుని, ధూల్‌పేటకు ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా బాధితురాలు వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది.ఇంటికి వచ్చిన బాలిక, జరిగిన ఘోరాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు వెంటనే అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు..

**తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ**

**మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది**

**భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు**

**స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి**

**త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి**



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు."మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారుపార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్‌ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.

# జైలు శిక్షల స్థానంలో జరిమానాలు.. 400 చిన్న నేరాల డీక్రిమినలైజ్.. అసెంబ్లీలో బిల్లు ఆమోదం



**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

తెలంగాణలో చిన్నచిన్న నేరాలకు జైలు శిక్షల స్థానంలో జరిమానాలు విధించే చారిత్రాత్మక నిర్ణయానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ 'జన్ విశ్వాస్' చట్టానికి అనుగుణంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 9 వేర్వేరు చట్టాల పరిధిలోని సుమారు 400 చిన్న నేరాలను (మైనర్ ఆఫెన్సెస్) డీక్రిమినలైజ్ చేస్తూ శనివారం శాసనసభలో బిల్లును ఆమోదించారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మరింత మెరుగుపరచడంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు పేర్కొన్నారు.'తెలంగాణ ప్రజా విశ్వాసం' పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పారదర్శకమైన పాలనను అందించడం, పౌరుల నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తెచ్చినట్లు తెలిపారు. వివిధ శాఖలతో సమగ్ర సమీక్షలు నిర్వహించిన తర్వాతే జైలు శిక్ష విధించాల్సిన అవసరం లేని సుమారు 400 నిబంధనలను గుర్తించి, వాటిని కేవలం ఆర్థిక జరిమానాలుగా మార్చినట్లు వివరించారు. వివాదాలను తగ్గించేందుకు అడ్మినిస్ట్రేటివ్ అజుడికేషన్ మెకానిజం, తప్పుల తీవ్రత ఆధారంగా గ్రేడెడ్ పెనాల్టీలను ఈ బిల్లులో పొందుపరిచారు.తెలంగాణ అడవుల చట్టం-1967, ఎక్సైజ్ చట్టం-1968, ఫారెస్ట్ ప్రొడ్యూస్ రెగ్యులేషన్ యాక్ట్-1971, ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ హాలిడేస్ యాక్ట్-1978, ఇంటాక్సికేటింగ్ లిక్కర్స్ ప్రొహిబిషన్ యాక్ట్-1978, లేబర్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్-1987, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్-1988, వ్యాట్ (వాట) యాక్ట్-2005, టీజీ-ఐపాస్ (౧+-ఊఖం౦) యాక్ట్-2014 వంటి మొత్తం 9 చట్టాల్లోని చిన్నపాటి నిబంధనలను నేరాల జాబితా నుంచి తొలగించి జరిమానాల కిందకు మార్చారు.

# విమోచనదినాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**పటేల్ చొరవతోనే నిజాం పాలన అంతం: ఎంపీ కే లక్ష్మణ్**

**అమరుల త్యాగాల స్మరణకే విమోచన ఉత్సవాలు మాజీ ఎంపీ డా.బూర నర్సయ్యగౌడ్**

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**



సెప్టెంబర్ 17ను తెలంగా ణ విమోచన దినంగా రాష్ట్ర ప్రభుత్వ మే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు) డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాబోయే తరాలకు తెలంగాణ విమోచన చరిత్ర, స్వాతం త్ర్య విలువలు తెలియాలంటే పాఠశా ల పాఠ్యపుస్తకాల్లో తప్పనిసరిగా చేర్చాలని కోరారు. భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.రాంచందర్‌రావుతో పాటు ఎంపీ డా.కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, నాయకులు చారిత్రక యుద్ధట్యాంక్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఆపరేషన్ పోలో అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. దేశ రక్షణలో, హైదరాబాద్ సంస్థాన విముక్తి కోసం సేవలందించిన పలువురు మాజీ సైనికులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించడంలో ఆపరేషన్ పోలో కీలక ఘట్టమన్నారు.అమరుల త్యాగాలు, సుదీర్ఘ పోరాటల ఫలితంగానే నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి, తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ నిర్ణయం, కే.ఎం. మున్షీ చొరవ, భారత సైనిక చర్య ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని పేర్కొన్నారు.ట్యాంక్‌బండ్‌పై ఉన్న యుద్ధట్యాంక్ తెలంగాణ ప్రజలకు నిరంతరం స్ఫూర్తినిచ్చే చారిత్రక చిహ్నమని పేర్కొన్నారు. చరిత్రను విస్మరించారు: ఎంపీ లక్ష్మణ్ తెలంగాణ విమోచన చరిత్రను రాష్ట్రంలోని పాలక ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు రాజ్యసభ ఎంపీ డా. కె. లక్ష్మణ్ విమర్శించారు. 1948 సెప్టెంబర్ 13 భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని.. అయితే 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, రజాకార్ల అండతో నిజాం నవాబు నిరంకుశ పాలన కొనసాగించారని పేర్కొన్నారు.బైరాన్‌పల్లి, నిర్మల్ తదితర ప్రాంతాల్లో జరిగిన వీరోచిత పోరాటాలను, ప్రజల బలిదానాలను ఆయన గుర్తుచేశారు. జనరల్ జయంత్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్ పోలోలో తొలి అమరుడైన నాయక్ బచితర్ సింగ్‌కు భారత ప్రభుత్వం 'అశోక చక్ర' పురస్కారం ప్రదానం చేసిందని తెలిపారు. 46 మంది అమర జవాన్ల త్యాగాల పునాదులపైనే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ నిలిచి ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చొరవతో కేంద్ర ప్రభుత్వం విమోచన ఉత్సవాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 తర్వాత కూడా భారత సైన్యంపై కమ్యూనిస్టులు ఎందుకు పోరాటం కొనసాగించారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**అధికారికంగా నిర్వహించాల్సిందే : బూరనర్సయ్య గౌడ్**

మరుగునపడిన తెలంగాణ విమోచన వీరగాథలను, సైనికులు, పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ చైర్మన్ డా. బూరనర్సయ్య గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఎలాంటిదో, తెలంగాణ విమోచన స్ఫూర్తి కూడా అంతకంటే గొప్పదన్నారు.తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గౌరవించేందుకు సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ విమోచన ప్రదాత సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్తు, సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈనెల 17వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్ఫూర్తిదాయక కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు సంజయ్ ఘనతే, బోనేటి మారుతీ కిరణ్, వీరబెల్లి రవీందర్ రావు, మాజీ మేయర్ బండ కార్తీక, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మోర్చాల నాయకులు, మాజీ సైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో భారీ స్కామ్: డాలర్ల ఆశ చూపి కోట్ల రూపాయలు స్వాహా!




**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో భారీ పెట్టుబడుల కుంభకోణం వెలుగుచూసింది. తక్కువ సమయంలోనే డాలర్ల రూపంలో భారీగా లాభాలు ఆర్జించవచ్చంటూ అమాయక ప్రజలకు ఆశచూపి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన ఘరానా మోసం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్వాహకులు 'ఓమూజు' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే విదేశీ కరెన్సీ (డాలర్ల) రూపంలో ఊహించని రీతిలో భారీ రిటర్న్స్ వస్తాయని నమ్మబలికారు. వీరి మాటలు నమ్మిన స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు అత్యాశతో పెద్ద మొత్తంలో నగదును పెట్టుబడిగా పెట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు 300 మందికి పైగా బాధితుల నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేయగా, నియోజకవర్గ వ్యాప్తంగా వేల సంఖ్యలోనే బాధితులు ఉన్నట్లు సమాచారం.కోట్ల రూపాయల పెట్టుబడులు చేతికి అందగానే నిర్వాహకులు సంస్థ కార్యకలాపాలను రాత్రికి రాత్రే నిలిపివేసి బోర్డు తిప్పేశారు. లాభాలు రాకపోగా, కనీసం పెట్టిన అసలు కూడా తిరిగి రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ లబోదిబోమంటూ స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి విస్తృత దర్యాప్తు చేపట్టారు. నిందితులు అసలు ఎంత మొత్తం స్వాహా చేశారు? ఎంతమందిని మోసగించారు? ఈ 'ఓమూజు' సంస్థ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? అన్న కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితుల ఖాతా లావాదేవీలను పరిశీలిస్తూ పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.




# బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉత్కంఠ.. మంత్రి సోదరుడిపై రాంరెడ్డి విజయం

**హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ నూతన చైర్మన్‌గా సాముల రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం హైకోర్టు ప్రాంగణంలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగింది. చైర్మన్ పదవికి జరిగిన పోటీలో సాముల రాంరెడ్డికి 12 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు పొన్నం అశోక్ గౌడ్‌కు 11 ఓట్లు లభించాయి. దీంతో కేవలం ఒక ఓటు స్వల్ప తేడాతో రాంరెడ్డి విజయం సాధించారు. ఇదే పదవికి పోటీ చేసిన టి.హనుమంత్ రెడ్డికి 3 ఓట్లు దక్కాయి.వైస్ చైర్మన్‌గా చలకాని వెంకట్ యాదవ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సభ్యుడిగా జి.కిరణ్ కుమార్ గెలుపొందారు. వైస్ చైర్మన్ పదవికి జరిగిన ఎన్నికలో వెంకట్ యాదవ్‌కు 13 ఓట్లు రాగా, జాకీర్ హుస్సేన్ జావిద్‌కు 10, గోకుల్ రామారావుకు 3 ఓట్లు వచ్చాయి. ఇక బీసీఐ సభ్యుడి పదవికి జరిగిన పోటీలో జి.కిరణ్ కుమార్ 10 ఓట్లతో విజయం సాధించారు.రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల ద్వారా ఎన్నికైన 26 మంది బార్ కౌన్సిల్ సభ్యులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో నూతన కార్యవర్గం కొలువుదీరింది.

# ఆందోళన సమస్యలకు కేవలం జన్యువులే కాదు, ఇతర అనేక అంశాలు కూడా కారణమే.. అధ్యయనంలో వెల్లడి..



ఆందోళన సమస్యలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వాటి వెనుక ఉన్న జీవశాస్త్ర సంబంధిత కారణాలను అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఓ భారీ అధ్యయనం ఆందోళన లక్షణాలకు సంబంధించి మానవ జన్యుక్రమంలో 74 ప్రాంతాలను గుర్తించింది. వీటిలో 39 ప్రాంతాలు తొలిసారిగా ఆందోళనతో సంబంధం ఉన్నవిగా గుర్తించబడటం విశేషం. ఈ పరిశోధనను ఆందోళనకు సంబంధించిన జన్యు ప్రభావాలపై ఇప్పటివరకు లభించిన అతిపెద్ద ఆధారాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ అధ్యయనంలో యూరోపియన్ వంశావళికి చెందిన 6.93 లక్షల మందికి పైగా వ్యక్తుల జన్యు సమాచారాన్ని విశ్లేషించారు. ఆందోళన లక్షణాల తీవ్రతను జన్యు మార్పులతో పోల్చి పరిశీలించిన పరిశోధకులు, కొన్ని ప్రత్యేక జన్యు భేదాలు ఎక్కువ స్థాయిలో ఆందోళన లక్షణాలు కలిగిన వారిలో అధికంగా కనిపిస్తున్నాయని గుర్తించారు. దీనికోసం జీనోమ్ వైడ్ అసోసియేషన్ స్టడీ (+ఔూూ) అనే పరిశోధనా పద్ధతిని ఉపయోగించారు. ఈ విధానం ద్వారా ఒక వ్యాధి లేదా లక్షణంతో సంబంధం ఉన్న జన్యు మార్పులను గుర్తించవచ్చు.

**లక్షణాలు కూడా ముఖ్యమే..**

సాధారణంగా ఒక వ్యక్తికి ఆందోళన వ్యాధి ఉందా లేదా అనే కోణంలో మాత్రమే గత అధ్యయనాలు సాగాయి. అయితే ఈ పరిశోధనలో లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా, సాధారణ ఒత్తిడి నుంచి తీవ్రమైన ఆందోళన రుగ్మత వరకు ఉండే జీవశాస్త్ర సంబంధిత నిరంతర ప్రక్రియను అర్థం చేసుకునే అవకాశం లభించిందని పరిశోధకులు తెలిపారు. పరిశోధన ఫలితాలు జన్యువులు ఆందోళన ప్రమాదాన్ని ప్రభావితం చేయగలవని సూచిస్తున్నప్పటికీ, అవే అంతిమ నిర్ణయకాలు కాదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. జీవిత అనుభవాలు, సామాజిక పరిస్థితులు, మానసిక అంశాలు కూడా వ్యక్తిలో ఆందోళన అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల జన్యుపరంగా అధిక ప్రమాదం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆందోళన సమస్యలు వస్తాయని చెప్పలేం. అలాగే జన్యుపరంగా తక్కువ ప్రమాదం ఉన్న వ్యక్తులకు కూడా ఆందోళన ఏర్పడే అవకాశం ఉంటుంది.


**పర్యావరణ, సామాజిక అంశాలు సైతం..**

ఇటీవలి కాలంలో ఆందోళన కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, దీనికి ప్రధాన కారణం పర్యావరణ, సామాజిక అంశాలేనని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే జన్యువులు తరతరాల మధ్య పెద్దగా మారవు. కాబట్టి సమాజంలో ఆందోళన స్థాయిలను తగ్గించాలంటే జీవనశైలి, సామాజిక ఒత్తిళ్లు, పర్యావరణ పరిస్థితులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. అదే సమయంలో జన్యుపరమైన ప్రమాదాన్ని అర్థం చేసుకోవడం ద్వారా పర్యావరణ ప్రభావాలకు ఎక్కువగా స్పందించే వ్యక్తులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇది మరింత సమర్థవంతమైన నివారణ చర్యలు, వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అధ్యయనంలో పీసీఎల్‌వో, ఎస్‌వోఆర్‌సీఎస్3 వంటి కొన్ని జన్యువులు ఆందోళనతో సంబంధం కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఈ జన్యువులు ముఖ్యంగా మెదడు కణజాలంలో చురుకుగా పనిచేస్తూ, నాడీకణాల మధ్య సమాచార మార్పిడిలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో ఆందోళనకు మెదడు పనితీరుతో ఉన్న సంబంధంపై మరింత స్పష్టత లభించింది.

**శారీరక వ్యాధులు కూడా..**

అలాగే సాధారణ జన్యు భేదాలు వ్యక్తుల మధ్య ఆందోళన లక్షణాల తీవ్రతలో కనిపించే తేడాల్లో సుమారు 6 శాతం వరకు మాత్రమే కారణమవుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. మిగిలిన ప్రభావం పర్యావరణ అంశాలు, జన్యు-పర్యావరణ పరస్పర చర్యలు, ఇంకా గుర్తించని ఇతర జన్యు ప్రభావాల వల్ల ఉంటాయని వారు పేర్కొన్నారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఆందోళనకు మానసిక ఆరోగ్య సమస్యలతోపాటు కొన్ని శారీరక వ్యాధులతో కూడా జన్యుపరమైన సంబంధం ఉన్నట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. డిప్రెషన్, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, దీర్ఘకాలిక నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, ఎండోమెట్రియోసిస్, మైగ్రేన్ వంటి సమస్యలతో ఆందోళనకు గణనీయమైన జన్యు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఇక ఈ అధ్యయనాన్ని ఆందోళనకు సంబంధించిన జన్యు నిర్మాణాన్ని అర్థం చేసుకునే దిశగా కీలక ముందడుగుగా భావిస్తున్నారు. జన్యువులు, పర్యావరణం, జీవన అనుభవాలు కలిసి ఆందోళన ప్రమాదాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని విస్తృత పరిశోధనలు అవసరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# ఇన్‌ఫ్లుయెన్సర్ల ఫిల్టర్ అందానికి ఆకర్షితులవుతున్న యువత..



సోషల్ మీడియా మన రోజువారీ జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది. ముఖ్యంగా యువత ఎక్కువ సమయం గడిపే ఫోటో, వీడియో ఆధారిత ప్లాట్‌ఫామ్‌లు వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, శరీర ఆకృతి పట్ల ఉన్న అభిప్రాయాలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. తాజాగా వెలువడిన ఓ అధ్యయనం ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫిల్టర్ల వినియోగం, నిరంతర స్క్రోలింగ్ అలవాటు మన శరీర రూపం గురించి మెదడు ఏర్పరచుకునే అభిప్రాయాన్ని మార్చే అవకాశం ఉందని వెల్లడైంది. ఈ ప్రభావం ముఖ్యంగా యువత, కౌమారదశలో ఉన్న వారిలో ఎక్కువగా కనిపించే అవకాశముందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. మన రూపం, శరీర నిర్మాణం గురించి మనకు ఉన్న అవగాహనను బాడీ ఇమేజ్ గా పరిగణిస్తారు. ఇది కుటుంబం, సమాజం, వ్యక్తిగత అనుభవాలతోపాటు సోషల్ మీడియా ప్రభావంతో కూడా రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందుతున్న అంద చందాల ప్రమాణాలు చాలామందికి వాస్తవ జీవితానికి దూరంగా ఉంటున్నాయి. దీంతో చాలామంది తమ సహజ రూపంతో అసంతృప్తి చెందే పరిస్థితి ఏర్పడుతోంది.ా

## ఆఫీసుల్లో ఉత్సాహంగా పనిచేయాలంటే..
# ఈ ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను తినండి..

రోజంతా కార్యాలయంలో పని చేసే చాలామందికి మధ్యాహ్నం తర్వాత అలసట, ఏకాగ్రత తగ్గడం, మళ్లీ మళ్లీ కాఫీ లేదా టీ తాగాలనిపించడం వంటి సమస్యలు వస్తుంటాయి. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి సరైన స్నాక్స్‌ను ఎంచుకోకపోవడమేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. శరీరానికి స్థిరమైన శక్తిని అందించే ఆరోగ్యకరమైన చిరుతిండ్లు తీసుకుంటే మధ్యాహ్నం వచ్చే ఎనర్జీ క్రాష్‌ను నివారించవచ్చని సూచిస్తున్నారు. చాలామంది కార్యాలయానికి చేరుకున్న వెంటనే ఆకలి వేయడంతో కాఫీ లేదా టీతోపాటు బిస్కెట్లు, చిప్స్ వంటి అధిక చక్కెర, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాలను తీసుకుంటారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి, కొద్ది సేపటికే వేగంగా తగ్గిస్తాయి. దీంతో శరీరంలో శక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మళ్లీ కాఫీ లేదా తీపి పదార్థాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.



**స్థిరంగా శక్తిని అందించేవి మేలు..**

పోషకాహారం, మెదడు పనితీరుపై జరిగిన పరిశోధనల ప్రకారం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే స్థిరంగా శక్తిని అందించే స్నాక్స్‌ను ఎంచుకోవడం వల్ల శరీరం, మెదడు రెండూ చురుకుగా పనిచేస్తాయి. ఇందుకోసం ఖరీదైన సూపర్‌ఫుడ్స్ కొనాల్సిన అవసరం లేదని, మన ఇంట్లోనే లభించే భారతీయ ఆహార పదార్థాలతో కూడా ఆరోగ్యకరమైన చిరుతిండ్లు తయారు చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. స్నాక్స్ తీసుకునేటప్పుడు ఒక ముఖ్యమైన నియమాన్ని పాటించాలని సూచిస్తున్నారు. కార్బోహైడ్రేట్లను ఒంటరిగా తీసుకోవడం కంటే వాటికి ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు లేదా ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలను జతచేయడం మంచిది. ఇలా చేస్తే రక్తంలో చక్కెర నెమ్మదిగా విడుదలై, శక్తి ఎక్కువసేపు నిలిచి ఉంటుంది. దీంతో ఆకలి త్వరగా వేయకుండా ఉండటంతోపాటు మెదడుకు కూడా నిరంతర శక్తి అందుతుంది.

**ప్రోటీన్లు, ఫైబర్ ఉండేలా..**

బిస్కెట్లకు బదులుగా చిన్న గిన్నె కాల్చిన శనగలను ప్లెయిన్ గ్రీక్ యోగర్ట్‌తో కలిపి తీసుకోవచ్చు. ఇందులో ప్రోటీన్, ఫైబర్ సమృద్ధిగా ఉండి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. కూల్‌డ్రింక్స్ లేదా ప్యాకెట్ జ్యూస్‌లకు బదులుగా కొబ్బరి నీరు లేదా మజ్జిగ తాగడం మంచి ఎంపిక. ఇవి శరీరానికి ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు అందించి వేసవిలో కూడా తాజాగా ఉంచుతాయి. చిప్స్, భుజియా వంటి అధిక ఉప్పు, నూనె ఉన్న చిరుతిండ్లకు బదులుగా బాదం, వాల్‌నట్స్, పల్లీలు వంటి కాల్చిన లేదా ఎయిర్ ఫ్రై చేసిన మిశ్రమ నట్స్‌ను తీసుకోవచ్చు. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్‌ను అందించి శక్తిని ఎక్కువసేపు నిలుపుతాయి. రోజువారీ ఆహారంలో చిన్నచిన్న మార్పులు చేయడం ద్వారా మధ్యాహ్నం వచ్చే అలసటను తగ్గించుకోవచ్చు. అధిక కాఫీ లేదా టీపై ఆధారపడకుండా, సమతుల్య పోషకాలు ఉన్న స్నాక్స్‌ను ఎంచుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా, ఏకాగ్రతతో పని చేయడం సులభమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## అధిక బరువును తగ్గించడంలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..
# మొలకలు లేదా ఉడికించిన శనగలు..?





కొవ్వు తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నవారు ఆహారంలో ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే పదార్థాలను చేర్చాలని నిపుణులు సూచిస్తుంటారు. అలాంటి ఆహారాల్లో మొలకలు (స్ప్రౌట్స్), ఉడికించిన శనగలు (బాయిల్డ్ చనా) రెండూ ప్రముఖమైనవి. ఇవి రెండూ పోషకాలతో నిండినవే అయినప్పటికీ, బరువు తగ్గడంలో ఒక్కోటి ఒక్కో విధంగా ఉపయోగపడుతుంది. కాబట్టి ఏది మంచిదనే దానికంటే, వ్యక్తిగత అవసరానికి అనుగుణంగా ఏది ఎప్పుడు తీసుకోవాలన్నది తెలుసుకోవడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు. మొలకలు తక్కువ కేలరీలను కలిగి ఉండటంతోపాటు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా అందిస్తాయి. మొలకలు తయారయ్యే ప్రక్రియలో పప్పుధాన్యాల పోషక విలువ పెరగడమే కాకుండా అవి శరీరంలో సులభంగా జీర్ణమవుతాయి. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచి, తక్కువ ఆహారంతోనే కడుపు నిండిన భావన కలిగిస్తాయి.

**ఎందులో ఏయే పోషకాలు ఉంటాయి..**

అమెరికా వ్యవసాయ శాఖ (ఖూణూూ) వివరాల ప్రకారం ఒక కప్పు (సుమారు 202 గ్రాములు) మొలకల్లో దాదాపు 14.2 గ్రాముల ప్రోటీన్, 15.4 గ్రాముల ఫైబర్ లభిస్తాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే పచ్చి మొలకలు కొంతమందిలో గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతాయి. అందువల్ల వాటిని స్వల్పంగా ఆవిరిలో ఉడికించి లేదా తేలికగా వండి తినడం మంచిది. ఉదయం అల్పాహారంగా, మధ్యాహ్నానికి ముందు స్నాక్‌గా లేదా వ్యాయామానికి ముందు తీసుకుంటే శక్తినిస్తూ కడుపుకు భారంగా అనిపించదు. రాత్రివేళ పచ్చి మొలకలు తినడం తగ్గించడం మంచిది. ఉడికించిన శనగలు కూడా బరువును తగ్గించే ఆహారాల్లో ముఖ్యమైనవి. వీటిలో ప్రోటీన్, ఫైబర్‌తోపాటు నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బోహైడ్రేట్లు ఉండటంతో ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. దీంతో మధ్యలో చిరుతిండి తినాలనే కోరిక తగ్గి, మొత్తం కేలరీల తీసుకునే పరిమాణం తగ్గే అవకాశం ఉంటుంది. ఖూణూూ ప్రకారం 100 గ్రాముల ఉడికించిన శనగల్లో సుమారు 9 గ్రాముల ప్రోటీన్, 8 గ్రాముల ఫైబర్, 2.6 గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగి, రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా సహాయపడతాయి. దీంతో భోజనం చేసిన తర్వాత కూడా ఎక్కువసేపు తృప్తిగా ఉంటుంది.

**ఏవి ఉత్తమం..**

శనగలను బాగా నానబెట్టి పూర్తిగా ఉడికించి తింటే జీర్ణం సులభతరమవుతుంది. వీటిని సలాడ్‌లు, చాట్‌లు లేదా ఇతర వంటకాలతో కలిపి తినవచ్చు. మధ్యాహ్న భోజనంలో, సాయంత్రం స్నాక్‌గా లేదా వ్యాయామం అనంతరం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. బరువు తగ్గడంలో మొలకలు, ఉడికించిన శనగలు రెండూ ఉపయోగకరమైనవే. తక్కువ కేలరీలతో తేలికైన ఆహారం కావాలనుకునేవారికి మొలకలు మంచి ఎంపిక. ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండే, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం కావాలనుకుంటే ఉడికించిన శనగలు అనుకూలంగా ఉంటాయి. ఒకదానికే పరిమితం కాకుండా వారంలో కొన్ని రోజులు మొలకలు, మరికొన్ని రోజులు ఉడికించిన శనగలు తీసుకోవడం ద్వారా రెండింటి పోషక ప్రయోజనాలను పొందవచ్చు. సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామంతో కలిపి ఈ రెండింటినీ ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యకరంగా బరువు తగ్గే అవకాశాలు మెరుగుపడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# బరువు పెరుగుతామనే భయంతో అన్నాన్ని పూర్తిగా మానేయాల్సి పనిలేదు.. ఏం చేయాలంటే..?

కొంతమంది బరువు తగ్గాలనే ఉద్దేశంతో అన్నాన్ని పూర్తిగా మానేస్తుంటారు. అయితే తరతరాలుగా భారతీయుల ఆహారంలో భాగంగా ఉన్న బియ్యానికి భయపడాల్సిన అవసరం లేదని, సరైన పరిమాణంలో తీసుకుంటే అది ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారంలో భాగమవుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆహారాన్ని పూర్తిగా మానేయడం కంటే సమతుల్యంగా తీసుకోవడమే ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచిస్తున్నారు. బియ్యం ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా వినియోగించే ప్రధాన ధాన్యాల్లో ఒకటి. ఇందులో శరీరానికి అవసరమైన 15కుపైగా ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి. బి-విటమిన్లు (థయామిన్, నియాసిన్, విటమిన్ బి6), మెగ్నీషియం, ఫాస్ఫరస్, సెలీనియం వంటి ఖనిజాలతోపాటు కార్బోహైడ్రేట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి ప్రధాన శక్తి వనరులుగా పనిచేస్తాయి.

**శరీరానికి స్థిరంగా శక్తి..**

బియ్యంలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు (కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్) నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో శరీరానికి శక్తి క్రమంగా విడుదల అవుతుంది. ఇది ఎక్కువసేపు ఉత్సాహంగా ఉండేందుకు, ఆకలి త్వరగా వేయకుండా ఉండేందుకు సహాయపడుతుంది. శుద్ధి చేసిన చక్కెరలు అధికంగా ఉండే ఆహారాల మాదిరిగా ఒక్కసారిగా శక్తి పెరిగి వెంటనే తగ్గిపోవడం (ఎనర్జీ క్రాష్) జరగకుండా రోజంతా స్థిరమైన శక్తిని అందించడంలో బియ్యం ఉపయోగపడుతుంది. అలాగే ఏకాగ్రతను మెరుగుపరచడంలో కూడా తోడ్పడుతుంది. గ్లూటెన్‌కు అలెర్జీ లేదా సున్నితత్వం ఉన్నవారికి బియ్యం మంచి ప్రత్యామ్నాయం. గోధుమ, బార్లీ, రై వంటి ధాన్యాల్లో ఉండే గ్లూటెన్ కొందరిలో జీర్ణ సంబంధ సమస్యలను కలిగిస్తుంది. అయితే బియ్యంలో సహజంగానే గ్లూటెన్ ఉండదు.

సామాన్యుడి అస్త్రం

# దోరతి రికార్డు!

కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన తాజాచిత్రం 'దోరతీ' జియో స్టూడియోస్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు నిర్మించాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కెరీర్‌లో సంగీత సారథ్యం వహించిన 1540వ సినిమా ఇదే కావడం విశేషం. సెప్టెంబర్ 25న థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఈ మూవీ విడుదలకు ముందే అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది.కెనడాలోని ప్రతిష్టాత్మక టొరంటో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్)లోని సెంటర్‌పీస్ విభాగంలో ఈ మూవీకి సంబంధించి వరల్డ్ ప్రీమియర్ ప్రదర్శన జరిగింది. గత దశాబ్ద కాలంలో ఈ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమైన తొలి తమిళ సినిమాగా 'దోరతీ' చరిత్ర సృష్టించింది.స్కానిబాంక్ థియేటర్‌లో జరిగిన ఈ ప్రీమియర్ షోకు ప్రధాన తారాగణమైన కీర్తి సురేశ్, సనత్, రిషికాంత్‌తోపాటు చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, నిర్మాతలు గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్ హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే టీఐఎఫ్ఎఫ్ అంతర్జాతీయ వేదికపై ఈ సినిమాకు సముచిత గౌరవం దక్కటం గొప్ప విషయం.




# రూ.2 కోట్లతో తీస్తే రూ.200 కోట్లు కురిపించింది.




జాతీయ స్థాయిలో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై, బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. 'హనుమాన్ అంశ్ – ఆంజనేయుడి అవతారం' పేరుతో రానున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను రేపు (సెప్టెంబరు 14) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండటం విశేషం. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంస్థ ఈ సినిమాను సెప్టెంబర్ 18న తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, రేపు టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు.ఈ చిత్రం ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా (మహరాజ్‌జీ) జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించగా, శోభినవ్ సత్య ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు. హిందీలో కేవలం రూ. 2 కోట్ల నామమాత్రపు బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, అనూహ్యంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

# నా ఫ్యామిలీ, నా ఇష్టం..



ప్రపంచ మాజీ సుందరి, ప్రముఖ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు సంబంధించిన ఒక పాత ఇంటర్వ్యూ క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, తల్లిదండ్రులతోనే కలిసి నివసించడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాశ్చాత్య సంస్కృతికి, భారతీయ జీవన విధానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఈ వీడియోలో ఆమె స్పష్టంగా వివరించారు.అమెరికాలో యువత యుక్త వయసు రాగానే తల్లిదండ్రులను విడిచి సొంతంగా నివసించడంపై ఐశ్వర్య ఆ ఇంటర్వ్యూలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "అక్కడ అది ఒక సామాజిక నియమమా? అందరూ తప్పనిసరిగా ఇల్లు విడిచి వెళ్లిపోవాలా? ఎందుకో అది నాకు అర్థం కావడం లేదు" అని ఆమె ప్రశ్నించారు.ముప్పై ఏళ్లు పైబడిన విజయవంతమైన అమెరికన్ మహిళలు సాధారణంగా తల్లిదండ్రులతో కలిసి ఉండరని ప్రస్తావించినప్పుడు,


# బిగ్ బాస్ షో నుంచి పారిపోయేందుకు గోడెక్కిన తమిళ కంటెస్టెంట్

ప్రముఖ రియాలిటీ షో బిగ్ బాస్ తమిళం 10వ సీజన్ ప్రారంభమైన రెండో రోజే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కంటెస్టెంట్ ఏకంగా హౌస్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించి అందరినీ షాక్‌కు గురిచేశాడు. ఈ ఘటనతో షోలో ఒక్కసారిగా కలకలం రేగింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# నందమూరి వారసుడికి జోడీగా..?

నందమూరి బాలకృష్ణ కొడుకు మోక్షజ్ఞ సినిమాల్లో ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. అయితే, మోక్షజ్ఞ నటించనున్న తొలిచిత్రంలో హీరోయిన్‌గా శ్రీలీల నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ విషయమై చిత్రబృందం ఆమెతో చర్చలు జరుపుతోందని ఫిలింనగర్ సర్కిళ్లలో జోరుగా ప్రచారం సాగుతోంది. నందమూరి బాలకృష్ణ నటవారసుడిగా మోక్షజ్ఞ ఎంట్రీ ఇస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి 'బింబిసార'ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ సినిమా సోషియో ఫాంటసీ కథాంశంతో రూపకల్పన అవుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో మోక్షజ్ఞ సరసన కథానాయికగా శ్రీలీల పేరును చిత్రబృందం పరిశీలిస్తోంది. శ్రీలీల అద్భుతమైన డాన్స్, నటన నైపుణ్యాలు ఈ సినిమాకు కలిసి వచ్చే అంశాలవుతాయని



భావిస్తున్నారట టీమ్.ఈ చిత్రంలో నందమూరి బాలకృష్ణ కూడా దాదాపు 15 నిమిషాల పాటు సాగే ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారని భోగట్టా. తండ్రీకొడుకులు ఇద్దరినీ ఒకే తెరపై చూడటం అభిమానులకు పెద్ద పండుగ లాంటి విషయమే. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# బ్రేకింగ్ న్యూస్‌తో అంతా తలకిందులు!

వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న యువ కథానాయిక అనన్య నాగళ్ల. ఈ బ్యూటీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజాచిత్రం 'ది బ్రేకింగ్ న్యూస్'(ఒష్ట్రవ దీతీఝునెఱఅస్త్ర చీవషం). పవన్ కడియాలా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో టాలీవుడ్ సీనియర్ నటుడు మురళీమోహన్ కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.ఇదిలావుండగా, హీరోయిన్ అనన్య నాగళ్ల తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్డేట్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. "ఇదిగో.. సంచలనం సృష్టించబోయే వార్త వచ్చేస్తోంది. ఎదురుచూపులకు తెరపడింది, నిశ్శబ్దం వీడింది. సోషల్ మీడియాను ఊపేయబోయే ఆ బ్రేకింగ్ న్యూస్ వచ్చేస్తోంది" అని పేర్కొంది అనన్య. ఈ



మూవీ ట్రైలర్‌ను సెప్టెంబర్ 18న విడుదల చేయబోతున్నట్లు కూడా వెల్లడించిందీ ముద్దుగుమ్మ.ఒక బలమైన కథ, దానికి తగ్గట్టుగా అదిరిపోయే విజువల్స్‌తో ఈ ట్రైలర్ ఉండబోతోందని పేర్కొంది. ప్రేక్షకులను ఆలోచింపజేసే, అంతా తలకిందులు చేసే మరో సంచలనాత్మక వార్త కూడా ఆ రోజు బయటకు రానుందని తెలుపడటం ద్వారా సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.